
ప్రజాశక్తి

మంగళవారం 4 నవంబర్ 2025 | 5 | విజయనగరం



సమిష్టి కృషితో సత్ఫలితాలు : కలెక్టర్

కంటోన్మెంట్ : సమన్వయంతో, సమిష్టిగా కృషి చేసినప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. మొంథా తుపానును ఎదుర్కోవడంలో జిల్లా యంత్రాంగాన్ని సమర్థంగా నడిపించి, అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలను చేపట్టి నష్టాన్ని గణనీయంగా నివారించిన కలెక్టర్ రామసుందర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి ప్రత్యేకంగా అభినందనలు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను, జాయింట్ కలెక్టర్ ఎస్. సేదుమాధవన్ ను సోమవారం గ్రీవెన్స్ సెల్ లో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.మురళి ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తుఫాను ను ఎదుర్కోవడంలో జిల్లా అధికారుల నుంచి సచివాలయ సిబ్బంది వరకు ప్రతిఒక్కరూ సహకరించారని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం, సమన్వయంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్ ను, రాష్ట్రస్థాయి మొంథా అవార్డు గ్రహీతలైన ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, విఆర్ఓ రాజ్ మోహన్, ఆశా వర్కర్ బంగారమ్మను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సంక్షేమం



వసతిగృహానికి వెళ్లే దారిది

- వసతిగృహాల్లో కొరవడిన వసతులు
- ఎన్నాళ్లయినా తీరని విద్యార్థుల వెతలు

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్నాళ్లయినా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన మాత్రం కలగానే మిగులుతోంది. ఫలితంగా విద్యార్థులు అరకొర వసతుల మధ్య చదువు కొనసాగించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. శిథిలావస్థకు చేరిన భవనాలు, అరకొర మరుగుదొడ్లు, తలుపులు లేని కిటికీలు, పంపిణీ కాని రగ్గులు, అమలు కాని మెనూ ఇది సంక్షేమ వసతి గృహాల్లో కనిపిస్తున్న దృశ్యాలు.



బెడ్లు లేక గచ్చుపైనే నిద్రిస్తున్న విద్యార్థి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సి ఇంటర్మీడియట్ బాలుర వసతి గృహంలో ఇంటర్మీడియట్ నుంచి పిజి, బిఇడి తదితర కోర్సులకు చెందిన 70 మంది విద్యార్థులు ఉంటున్నారు. కొత్తవలస బిసి బాలికల వసతి గృహంలో 50 మంది, కొత్తవలస సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహంలో ఇంటర్ నుంచి డిగ్రీ పీజీ వరకు 50 మంది, వియ్యం పేట సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సి బాలుర వసతి గృహంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 50 మంది విద్యార్థులు ఉంటున్నారు. కొత్తవలస ఎస్సి బాలుర ఇంటర్ వసతి గృహం, సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలికల ఇంటర్ వసతి గృహం కాస్త మెరుగుగా ఉన్నప్పటికీ మిగతా రెండు హాస్టళ్లలో సమస్యలు వెంటాడుతున్నాయి.

పట్టణ పరిధిలోని బిసి బాలికల వసతి గృహం పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ హాస్టల్లో మూడు నుంచి 10వ తరగతి వరకు 50 మంది విద్యార్థులు ఉంటున్నారు. విద్యార్థులు కనీసం తమ బట్టలు, సామాన్లు దాచుకునేందుకు కనీస వసతులు కూడా లేవు. నేలపైనే భద్రపరచుకుంటూ గాలికి, చలికి వణికిపోతున్నారు. వసతి గృహం గేట్లు సరిగా లేక రక్షణ కరువైందని విద్యార్థులు గగ్గలు పెడుతున్నారు. గతంలో ఈ హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలైన సంఘటన అప్పటి కలెక్టర్ సూర్యకుమారి స్వయంగా పరిశీలించి ఈ వసతి గృహాన్ని కొత్తవలస ఎస్సి బాలురు వసతి గృహంలోకి మార్చాలని ప్రతిపాదనలు పంపారు. దానికి తోడు ఈ వసతి గృహంలో ఉన్న బాలికలు రైల్వే అండర్ బ్రిడ్జి దాటి రావాలంటే భయపడి పోతున్నారు. వర్షం వచ్చిందంటే అండర్ బ్రిడ్జి నిండిపోతుందని, తాము నడిచి బ్రిడ్జి దాటి స్కూల్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. హాస్టల్లో ఉన్న బాత్రూములు డోర్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. నేలపై నిద్రిస్తుండడంతో విష పురుగులు వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. హాస్టల్ వ్యవస్థకు చెందడంతో కొత్తవలస పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్సి బాలుర వసతి గృహానికి మార్చాలని విద్యార్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. వియ్యంపేట ఎస్సి బాలుర వసతి గృహంలో వసతులు కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ హాస్టల్‌కు వెళ్లేందుకు రహదారి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షం వచ్చిందంటే మోకాలు లోతులో దిగి హాస్టల్లోకి వెళ్తున్నామని రాత్రిపూట బయటకు రావాలంటే భయమేస్తుందని విద్యార్థులు తెలిపారు.



కెజెపూడిలో బిక్కు బిక్కు మంటూ చూస్తున్న విద్యార్థి

ఇరుకు గదుల్లో బిక్కుబిక్కుమంటూ..

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సౌకర్యాల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 165 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి వసతిగృహంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. ఇరుకు గదులతో ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక వసతిగృహంలో చదువులు కొనసాగించాల్సి వస్తోంది. ఇటీవల మొంథా తుపాను సమయంలో పగలంతా పక్కనే ఉన్న పాఠశాలలో తలదాచుకుంటూ, రాత్రి సమయంలో ఇరుకుగా ఉన్న గదుల్లోనే గడిపారు. ఉన్న గదులకు కూడా పూర్తిస్థాయిలో కిటికీలు లేవు. చలిగాలులు, దోమలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. వసతిగృహ భవనం సైతం శిథిలావస్థకు చేరింది. పరిశుభ్రం చేయడానికి సిబ్బందిని ప్రభుత్వం నియమించక పోవడంతో వార్డెన్ శ్రీనివాసరావు సొంత డబ్బులతో కూలీలను ఏర్పాటు చేసి, శుభ్రం చేయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతిసౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సిపిఎం నాయకులు, గిరిజనులు

గిరిజన సమస్యల పరిష్కారానికి

తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గిరిజన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సిపిఎం ఆధ్వర్యాన సోమవారం గిరిజనులు ముట్టడించారు. ఎస్.కోట మండలానికి చెందిన రేగ పుణ్యగిరి, కొండమల్లిపూడి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గతంలో అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందనా లేకపోవడంతో సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులంతా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రధానంగా రహదారి సౌకర్యం లేకపోవడంతో అనేక పోరాటాల తర్వాత కలెక్టర్ అంబేద్కర్ స్పందించి ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి రేగ పుణ్యగిరి గ్రామం వరకు నాలుగు కోట్ల రూపాయలతో రోడ్డు మంజూరు చేశారని, కిందస్థాయి అధికారుల నుంచి పర్యవేక్షణ కొరవడంతో ఆ రోడ్డు పనులు ఆగిపోయాయని అన్నారు. ఈ ఆటంకాలకు కారణాలు అధికారులు తెలుసుకొని పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కొండమల్లి పూడికి చెందిన 18 గిరిజన కుటుంబాలకు 1996లో సర్వేనెంబర్ 3లో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, అయితే ఆ భూమని ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి 2017లో కొనుగోలు చేశాడని తెలిపారు. 1996లో ప్రభుత్వ భూమి అయి ఉన్నప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనేసరికి జిరాయితీ భూమి ఎలా అయిందని ప్రశ్నించారు. కాసులకు కక్కుర్తి పడి గిరిజనులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారికి అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తున్నారని దుయ్యబట్టారు. అందువల్లే గిరిజనులకు పట్టాలిచ్చిన చోట భూమిని అప్పగించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన ప్రజలకు సర్వే నంబరు 3లో పక్కా ఇళ్లనిర్మించుకునేందుకు ఎల్‌పిసిలు ఇవ్వాలని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కు చట్ట ప్రకారం మండల పరిధిలో 280 మంది పోడు సాగు చేసుకొని వ్యవసాయం చేస్తున్నారో వారికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారుర. స్పందించిన తహశీల్దార్ శ్రీనివాసరావు శుక్రవారం లోగా కొండ మల్లిపూడి గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని, రేగ పుణ్యగిరి రహదారికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, మండల నాయకులు చెలికాని ముత్యాలు, జి.సన్యాసిరావు, ఎస్ అర్జున్ . సూరి సాంబయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు సరికావు : ఎమ్‌పి

విజయనగరంకోట : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ దేవాలయంలో 9 మంది మృతి ఘటనపై మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశాల్లో ఉన్నప్పటికీ వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రులను, ఎమ్మెల్యేలను సంఘటన స్థలానికి చేరుకున్నట్లు చేసి తగు చర్యలను చేపట్టారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మానిటరింగ్ చేశారని తెలిపారు. ఈ విషయంపై మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి బెంగళూరులో ఉంటూ ఏం జరిగిందో తెలుసుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. సమావేశంలో సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, గాజులు రేగ పిఎసిఎస్ చైర్మన్ కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

విజయనగరంకోట : గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లాస్థాయిలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన ,వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు విశేష స్పందన లభించిందని సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ అన్నారు. 500 మందికి పైగా విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు, ఈ పోటీలను సంస్థ అధ్యక్షులు మాజీ గవర్నర్ డా.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.గోపాలరావు, కాపు గంటి ప్రకాష్, మానాపురం రాజా చంద్రశేఖర్, డాక్టర్ జక్కు రామకష్ణ, ఈపు విజయకుమార్, గురజాడ ఇందిర పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 30న గురజాడ వర్ధంతి సందర్భంగా గురజాడ విశిష్టపురస్కార ప్రదానోత్సవంలో అందజేస్తామని తెలిపారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ఎంఎస్‌ఎంఇ పార్కుతో

గిరిజనుల జీవితాలు అతలాకుతలం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని మిర్తివలస పంచాయతీ కొట్టెక్కి రెవెన్యూ పరిధిలో ఉన్న కాకర్లవలస, పుల్లేరుగుడ్డివలసలో గిరిజనుల సాగు భూములను బలవంతంగా లాక్కొని, ఎంఎస్‌ఎంఇ పార్కు పేరుతో వారి జీవితాలను అతలాకుతలం చేస్తున్నారని సిపిఎం ఆధ్వర్యంలో మండల కార్యాలయాల సముదాయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు, మన్యం జిల్లా నాయకులు మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం అన్యాయమన్నారు. అభివృద్ధి పేరుతో గిరిజన కుటుంబాల జీవితాలు రోడ్డుపై పడేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే వారి సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొండకెంగువ, తంగేడుగుడ్డివలస, జీలుగువలస, గొల్లలపేట, జోగిందొరవలసలో గిరిజనులు, దళితులు సాగు చేసే భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కాకర్లవలసలో సాగు చేసే పోడు భూములలో ఎంఎస్‌ఎంఇ పార్కు రద్దు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మద్దతు లెంక ఎర్రంనాయుడు, లక్ష్మణ, తౌడమ్మ, గంగరాజు, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్టర్ల ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ కాంట్రాక్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. విజయకుమార్, డిప్యూటి కోఆర్డినేటర్ అర్.సాధురావు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాలపరిమితి ముగిసిన బిల్లుల డిపాజిట్లు, రెండేళ్లగా బకాయి ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్న బిల్లుల జాప్యాన్ని నివారించాలన్నారు. ఆడిట్ విభాగాన్ని ప్రక్షాళన చేసి, ఎగ్జామినర్ విధానం మార్చాలన్నారు.కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లింపు విషయంలో కమిషనర్ నియంతృత్వ విధానం విడనాడాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుకు అశోక్, లింగరాజు, అధ్యక్ష, కార్యదర్శులు బంగార్రాజు, రాజ్ కుమార్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోందన్నారు. కార్పొరేషన్‌లో డబ్బులు ఉన్నాయని చెప్పి టెండర్లు పిలిచి, పనులు చేయించుకున్న తర్వాత పేమెంట్ చేసే విషయంలో తమకు సంబంధం లేదు అన్నట్లుగా అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. ధర్నాకు జిల్లా కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు అట్టాడ చిన్నమనాయుడు మద్దతు తెలిపారు. ధర్నాలో కాంట్రాక్టర్లు దువ్వి శ్రీనివాసరావు, మచ్చ సత్యన్నారాయణ, నరేంద్ర, శ్రీనివాసరాజు, సత్యానారాయణ, వాసు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం : ఎస్‌పి

కంటోన్మెంట్ : ఫిర్యాదుదారుల వినతులను పరిశీలించి సకాలంలో న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యలపట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈవారం 54ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 8, కుటుంబ కలహాలకు సంబంధించినవి 9, మోసాలకు పాల్పడినట్లు 7, నగదు వ్యవహారాలకు సంబంధించి 2, ఇతర అంశాలకు సంబంధించినవి 28 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఏడురోజుల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో గడువు దాటొద్దు

కలెక్టర్ రామసుందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్


పిజిఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీలను గపువు లోపలే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం రెండు శాఖల వద్ద రెండు అర్జీలు గడువు దాటి ఉన్నాయని, పిజిఆర్ఎస్ అర్జీలు గడువు దాటకుండా చూడాలని అధికారులకు సూచించారు. సోమవారం పిజిఆర్‌ఎస్ అర్జీల ఆడిట్ పై సమీక్షించారు. ప్రీ ఆడిట్ లో ప్రవర్తనాపరమైన లోపాలు, పద్ధతిని అనుసరించే విధానం పై కలెక్టరేట్ కాల్ సెంటర్ నుండి ఆడిట్ టీమ్ అర్జీదారులతో మాట్లాడి ఫోన్ ద్వారా తెలుకోవడం జరుగుతోందని, వారు చెప్పిన విషయాల్ని వాస్తవంగా నమోదు చేయాలని తెలిపారు. అసంతృప్తి శాతం ఎక్కువగా ఉన్న మండలాల తహశీల్దార్ల వద్ద నున్న అర్జీలను మండల ప్రత్యేకాధికారులు సమీక్షించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ సేదు మాధవన్, ఆర్‌డిఒ శ్రీనివాస మూర్తి, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి మురళి పాల్గొన్నారు.

క్లెయిమ్ చేయని డిపాజిట్ల క్లెయిమ్ కు అవకాశం

గత పదేళ్లుగా బ్యాంకులలో క్లెయిమ్ చేయని డిపాజిట్లను క్లెయిమ్ చేసుకోవడానికి వీలుగా ఆర్‌బిఐ విడుదల చేసిన మార్గదర్శకాలు డిసెంబర్31 లోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అందుకు వీలు కల్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ మీ డబ్బు - మీ హక్కు ప్రచారాన్ని ప్రారంభించిందన్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను పిజిఆర్‌ఎస్ లో కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో రూ. 52.35 కోట్ల విలువైన 335081 రిటైల్ డిపాజిట్లు, రూ. 7.19 కోట్ల విలువైన 8411 సంస్థాగత డిపాజిట్లు, రూ. 9.99 కోట్ల విలువైన 4340 ప్రభుత్వ డిపాజిట్లు క్లెయిమ్ చేయని డిపాజిట్లుగా ఉన్నాయన్నారు.

అత్యుత్తమ పిఎసిఎస్‌గా తీర్చిదిద్దుతాం

డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున



పిఎసిఎస్ చైర్మన్‌తో మాట్లాడుతున్న నాగార్జున

ప్రజాశక్తి -విజయనగరంకోట

దేశంలోనే అత్యుత్తమ పిఎసిఎస్‌గా గాజులరేగ పిఎసిఎస్‌ను తీర్చిదిద్దుతామని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం ఆయన పిఎసిఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘానికి అన్ని విధాలా మౌలిక సదుపాయాలను సమకూర్చి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దేందుకు డిసిసిబి కట్టుబడి ఉందని తెలిపారు. ఇందుకోసం రూ.5.00 కోట్ల కొత్త రుణాల మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ పిఎసిఎస్ నగర పరిధిలో ఉండటంతో పెద్దలు, స్థానికులు డిపాజిట్లు పెట్టి, సంఘాన్ని ఆర్థికబలాన్ని పెంపొందించేందుకు సహకరించాలని కోరారు. పిఎసిఎస్‌లో 6834 మంది సభ్యత్వం కలిగి ఉండగా ఆధార్ అనుసంధానం కేవలం 108 మంది సభ్యులకు మాత్రమే ఉండటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కోరాడ వెంకటరావు ఉన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు పోటెత్తిన జనం

- 375 ఫిర్యాదులు, విజ్ఞప్తులు
- రెవెన్యూ సమస్యలే అత్యధికం



పిజిఆర్‌ఎస్‌లో అర్జీలు అందజేసేందుకు బారులు తీరిన అర్జీదారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు సోమవారం జనం పోటెత్తారు. వందలాదిగా కదిలి వచ్చిన అర్జీదారులతో కలెక్టరేట్ ప్రాంగణం, ఆడిటోరియం కిటకిటలాడింది. పలువురు వ్యక్తిగత సమస్యలు పరష్కారం కోసం రాగా, మరికొంతమంది సామూహిక సమస్యలను ఏకరువుపెట్టారు. జిల్లా వ్యాప్తంగా వున్న 27 మండలాల నుంచీ వినతులు అందాయి. ఇందులో అత్యధికంగా ఎస్.కోట మండలం నుంచి 29 వినతులు అందగా, కొత్తవలస మండలం నుంచి 27వరకు అందాయి. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖ పరిధిలో 223 వరకు రావడం గమనార్హం. ఆ తరువాత స్థానంలో డిఆర్‌డిఎ పరిధిలో 53 దరఖాస్తులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎస్ రామసుందర్ రెడ్డి, జెసి, డిఆర్ఓ సహా పలువురు రెవెన్యూ శాఖ అధికారులు వినతులు స్వీకరించారు. మున్సిపాలిటీ శాఖకు 12, హౌసింగ్ శాఖకు 11, డిపిఒ కార్యాలయానికి 10, ఇతర శాఖలకు 66 ఫిర్యాదులు అందాయి. స్వీకరించిన దరఖాస్తుల్లో చాలా వరకు కలెక్టర్ అక్కడికక్కడే జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. సమయపాలనతో, పారదర్శకంగా, ప్రతి ఫిర్యాదును నాణ్యవంతంగా పరిష్కరించాలని సూచించారు.

వందలాదిగా జాయింట్ ఎల్‌పిల సమస్యలు

రెవెన్యూ శాఖ పరిధిలోని 1బి సమస్యపై కొందరు, సరిహద్దు వివాదాలపై మరికొందరు అర్జీలు ఇచ్చారు. ముఖ్యంగా రీసర్వే చేపట్టిన గ్రామాల నుంచి ఎక్కువగా జాయింట్ ఎల్‌పిల సమస్యలతో ఎక్కువ మంది వచ్చారు. తమ భూమి ఆక్రమణకు గురైందంటూ పలువురు అధికారులు ఏకరువుపెట్టారు.

కొత్త పింఛన్లు కోసం విన్నపాలు

ఎక్కువగా కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, సదరం సర్టిఫికెట్ల మంజూరు చేయాలని సుమారు 50మంది వరకు వినతులు అందజేశారు. భర్త చనిపోతే భార్యకు ఇవ్వడం తప్ప, 60ఏళ్లుదాటిన వారికి ఎప్పటికప్పుడు పింఛన్లు ఇవ్వడం లేదంటూ ఏకరువుపెట్టారు. ప్రమాదానికి గురికావడంతో వికలాంగులుగా మారి ఏళ్ల గుడుస్తున్నా సర్టిఫికెట్లు ఇవ్వడం, పింఛను మంజూరు చేయడం వంటివాటికి నోచుకోలేదంటూ కొందరు పిజిఆర్‌ఎస్‌లో వినతులు అందజేశారు. కార్యక్రమంలో జెసి సేధు మాధవన్, డిఆర్ఓ ఎస్.శ్రీనివాస్ మూర్తి, ఎస్‌డిసిలు వెంకటేశ్వర రావు, మురళి, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి.శాంతి, కళావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులను విడిపించండి

పొట్టకూటికోసం సముద్రపు వేటకు వెళ్లి బంగ్లాదేశ్‌లో బందీలుగా మారిన తమ కుటుంబ సభ్యులను విడిపించాలని కోరుతూ పూసపాటిరేగ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన 9 కుటుంబాలవారు, వారి తరఫున మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు బర్రి అప్పన్న కలెక్టర్‌కు వినతి అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ బంగ్లాదేశ్ అంబసీతో సంబంధాలు కొనసాగిస్తున్నామని, జాలర్ల విడుదల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

పత్తి, మొక్కజొన్నకు మద్దతు ధర కల్పించండి

అధిక వర్షాల కారణంగా ఇప్పటికే దిగుబడి విషయంలో నష్టపోయిన మొక్కజొన్న, పత్తి రైతులకు మార్కెట్ సదుపాయం కల్పించి, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు ఆధ్వర్యాన ఆ సంఘం నాయకులు, రైతులు కలిసి కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం క్వింటా మొక్కజొన్నకు రూ.2,400 క్వింటా పత్తికి రూ.8110 చొప్పున ప్రకటించాయని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారుల భారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ ఎదుట వీరంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్‌పి అమలుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ధనుంజయ నాయుడుకు చికిత్స అందించండి

సిఎం చంద్రబాబు దత్తిరాజేరు మండలం దత్తి గ్రామ సందర్శన సందర్భంగా పి. ధనుంజయ నాయుడుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేసి, ఆయన చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అప్పటికప్పుడు కలెక్టర్ ఐదు రూ.లక్షలు అందజేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ధనుంజయ నాయుడు కలెక్టర్ ను కలవగా, కలెక్టర్ వెంటనే డిఎంహెచ్‌ఒకు వైద్య సేవలందించేందుకు రిఫర్ చేశారు.

రైతులను ఆదుకోవాలి

విజయనగరం టౌన్ : తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీల సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం వినతి పత్రం అందజేశారు. పాడైపోయిన రోడ్లను డ్రైనేజీలను బాగు చేయాలని, ఇళ్లు కూలిపోయిన వారికి కొత్త ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల నాయకులు చోడి ఆదినారాయణ, రొంగలి రామారావు, ఇప్పిలి రామారావు, బోరా ఐశ్వర్య, చేలికి లక్ష్మణరావు, పైడ్రాజు, నాగరాజు మొదలగు ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

మెటీరియల్ కాంపొనెంట్ నిధులు విడుదల చేయాలి

విజయనగరం కోట : ఉపాధి హామీలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు కోరారు. సోమవారం రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి అందజేశారు. గ్రామీణ ప్రాంతాలలో పంట పొలాల రహదారులు, కల్వర్టులు, గ్రావెల్ రోడ్లు, భూ అభివృద్ధి పనులు, నీటి బావులకు నిధులు కేటాయించి ప్రాధాన్యత ఇవ్వాలని, మొక్క జొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనాలని కోరారు. వినతినిచ్చిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తత్తడి పైడిపునాయుడు, రైతు సంఘం జిల్లా నాయకులు ఈదుబిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హోమియో ఆస్పత్రిని వెల్‌నెస్ భవనంలోకి మార్చాలి

వేపాడ : బల్లంకి గ్రామంలోని హోమియో ఆస్పత్రిని వెల్‌నెస్ భవనంలోకి మార్చాలని సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు.. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి వినతి అందించారు. ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలమైందని, ఏమాత్రం వర్షం వచ్చినా నీరు ఆస్పత్రిలోకి చేరి మందులు తడిసిపోవడంతోపాటు, భవనం పెచ్చులూడి పోతోందని వివరించారు. స్పందించిన కలెక్టర్.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి, వెల్‌నెస్ సెంటర్ భవనంలోకి హోమియో ఆస్పత్రిని మార్చి, రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు అప్పారావు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మెంటాడను విజయనగరంలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలోనే కొనసాగించాలని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన కూటమి నాయకుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. గతంలో మాదిరిగానే మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో కొనసాగించాలని ప్రజల సంకల్పాన్ని పునరుద్ఘాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, ఎంపిటిసి రెడ్డి ఎర్రినాయుడు, బిజెపి మండల అధ్యక్షులు మణిపూరి అప్పలనాయుడు, జనసేన నాయకులు రాజశేఖర్, మండల నాయకులు సురేష్, పల్లె సింహాద్రి, మణిపూరి రామచంద్రుడు పాల్గొన్నారు.

కమాండెంట్‌గా రవిశంకర్ రెడ్డి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చింతలవలస ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా వై.రవిశంకర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి కమాండెంట్‌గా ఉన్న వి.ఎస్.పద్మ నాభరాజు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. బెటాలియన్ పరిసరాలను పరిశీలించారు. ట్రైనింగ్ మెస్, బ్యారక్‌లను సందర్శించారు. శిక్షణ వసతులు, వాటి నిర్వహణపై సమీక్షించారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న రవిశంకర్

ఆదాయానికి బలమైన వనరు కొబ్బరి

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం, పూసపాటిరేగ వంటి తీరప్రాంత మండలాలు కొబ్బరి సాగుకు అత్యంత అనుకూలమని ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి తెలిపారు. రైతులకు ఆదాయానికి బలమైన వనరు కొబ్బరి అన్నారు. ఇతర మండలాల్లో కూడా మెట్టు భూములు, నీటి పారుదల గల ప్రాంతాల్లో పంటల మార్పు ద్వారా కొబ్బరి సాగు విస్తరిస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో, డ్రిప్ పద్ధతితో నీటి వినియోగం తగ్గడం, మూడో సంవత్సరం నుంచే దిగుబడి రావడం వల్ల ఈ పంట రైతులకు లాభదాయకమని వివరించారు. అర్హులైన రైతులు.. రైతు సేవా కేంద్రం లేదా మండల ఉద్యాన అధికారిని సంప్రదించి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'మా కాలనీలో చెత్త వేసున్నారు'

ప్రజాశక్తి - చీపురుపల్లి

టిడిపి నాయకురాలు ఆరతి సాహు తమ కాలనీలోకి చెత్తా చెదారాన్ని వేస్తే, ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆనందపురం కొత్త కొమ్మరి వీధి వాసులు పంచాయతీ అధికారులకు వద్ద మొరపెట్టుకున్నారు. తాము ఎంత చెప్పినప్పటికీ వదిలేదే వారి ఇంటి ప్రహరీ గోడ మీద నుంచి తమ ఇళ్ల వైపు చెత్త వేయడంతో దుర్గంధంతోపాటు దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. కాలనీ వైపు చెత్తాచెదారం వేయకుండా పంచాయతీ అధికారులు నియంత్రించాలని వారు అధికారులను కోరారు.

కెఎంబికె ఘన నివాళి

ప్రజాశక్తి –బొబ్బిలి

సీనియర్ జర్నలిస్ట్, రాజా కళాశాల లెక్చరర్ కిల్లాన మోహన్ బాబు (కెఎంబి) సంతాప సభను పట్టణంలోని సూర్య రెసిడెన్సీలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బేబీనాయనతోపాటు జర్నలిస్టులు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. లోకబంధు విద్యాసంస్థల అధినేత తూముల భాస్కరరావు, గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌతు రామమూర్తి, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, సిపిఎం నాయకులు పి.శంకరరావు, బిజెపి నాయకులు శ్రీనివాస్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సామాజిక కార్యకర్తలు జెసి రాజు, ఎస్‌వి రమణమూర్తి, మాజీ కౌన్సిలర్లు ఎస్.సాయిరమేష్, కె.వెంకటరావు పాల్గొన్నారు.


కెఎంబి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మాజీ సైనికుల ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి –బొబ్బిలి

అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేస్తున్నట్లు మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్. కిరణ్ చెప్పారు. పెన్షన్ కోసం లైవ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేయాలి. ఇంటికి వెళ్లి డిజిటల్ లైవ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేయడంతో మాజీ సైనికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మరడ రాము నాయుడు, మాజీ సైనికులు ఎంఎల్ రావు, ఎ.గోవింద నాయుడు, ఎస్‌ఆర్ మోహనరావు, వివిఎస్ శర్మ, పాండురంగ రవి పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు కోరారు. చీపురుపల్లి జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్లో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ డివిజన్ స్థాయి క్రీడా పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, ఆరతి సాహు, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రామ్‌మల్లిక్ నాయుడు

వాటర్ ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని వీరనారాయణం ఉపసర్పంచ్ పురుషోత్తం నాయుడు తండ్రి మెరపల నాయనప్ప జ్ఞాపకార్థం నిర్మించిన వాటర్ ట్యాంకు, ట్యాప్‌లను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవతమ్మ, సర్పంచ్ మమ్ములూరి సరోజిని, మమ్ములూరి సోంబాబు పాల్గొన్నారు.

దంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

ప్రతి మనిషి దంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పూసపాటిరేగ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు అన్నారు. మండలంలోని పేరాపురంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో సోమవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్యులు అర్థ అనంత్, ప్రమీలా ఏపిలు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. బిపి, షుగర్ తనిఖీలు చేసి మందులు ఇచ్చారు. శిబిరంలో కళాశాల మెడికల్ ల్యాబ్ టెక్నికల్ అధ్యాపకుడు కె.మనోజ్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పారిశ్రామిక పార్కుల్లో పచ్చదనం - పరిశుభ్రత

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపిఐఐసి ఆధ్వర్యంలో పారిశ్రామిక పార్కుల్లో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం జరిగింది. అక్టోబర్ 15 నుండి నవంబర్ 15 వరకు నెల రోజుల పాటు ఏపిఐఐసి-ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ ప్రారంభించింది. ఇండస్ట్రియల్ పార్కుల సుస్థిరత, ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయడం లక్ష్యంగా ఈ డ్రైవ్ నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనం, పౌర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టింది. డ్రైవ్‌లో భాగంగా జోనల్ మేనేజర్ వివి శివారెడ్డి, ఎపిఐఐసి కమిషనర్ కె.జయచంద్ర, సిబ్బందితో కలిసి విజయనగరం, నెల్లిమర్ల పారిశ్రామిక ఎస్టేట్‌లో పెద్ద ఎత్తున పరిశుభ్రత డ్రైవ్, ప్లాంటేషన్ డ్రైవ్, వ్యర్థాలకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఎఇ కార్యాలయానికి తలుపులు వేసేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ఉచిత విద్యుత్ కోసం నిరసన

ప్రజాశక్తి-వేపాడ

ఉచిత విద్యుత్ అమలు చేయాలని సిపిఎం ఆధ్వర్యాన మారిక గిరిజనులు సోమవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయానికి తలుపులు మూసేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ మండలంలోని మారిక గ్రామంలో గిరిజనులకు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదన్నారు. గిరిజనులు 50 యూనిట్లలోపే వినియోగిస్తున్నా ఒక్కొక్కరికి రెండు వేల నుంచి రూ.12 వేల వరకు బిల్లులు ఇవ్వడం దారుణమన్నారు. ఉచిత విద్యుత్ ఇవ్వాల్సిన చోట బిల్లులు తీసుకుంటామంటే అంగీకరించేది లేదని హెచ్చరించారు. దీంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మేన్ కుమార్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఇ సూరిబాబు.. సిపిఎం నాయకులకు ఫోన్ చేసి, గిరిజనులకు ఇచ్చిన బిల్లులు వెంటనే వెనక్కి తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన ముగించారు. కార్యక్రమంలో మారిక సర్పంచ్ పోయిన పెంటమ్మ, గెమ్మల బాబూరావు, అప్పలనాయుడు, వెంకట్రావు, అసు, కుమార్, శ్రీను పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రీన్ అంబాసిడర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కూలీలకు తగిన కనీస వేతనాలు, శాశ్వత ఉద్యోగాలు, పెండింగ్ బకాయిల చెల్లింపు వంటి డిమాండ్లను వారు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. పిఎఫ్, ఇఎస్ఐతోపాటు జిఒ ప్రకారం నెలకు పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రేఖ నూకరాజు, కింతాడ అప్పారావు, తదితరులు ఉన్నారు.



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు


ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కాలనీ వాసులు

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - గజపతినగరం

పురిటిపెంట జగనన్న కాలనీలో రోడ్లు, కాలువలు, ఇంటింటి కొళాయిలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన కాలనీవాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, మండల నాయకులు డి.సింహాద్రి మాట్లాడుతూ జగనన్న కాలనీలో 110 వరకు ఇళ్లు పూర్తయినా సదుపాయాలు లేకపోవడం వల్ల రెండేళ్ల నుంచి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాలువలు, రోడ్లు లేక వర్షం వస్తే నీరు చేరి నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. దోమలు, పాముల వల్ల కంటి మీద కునుకు లేకుండా పోయిందని వాపోయారు. రెండేళ్లుగా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ దివ్యశ్రీకి సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రౌతు నాగమణి, మానాపురం అరుణకుమారి, వాస సత్య భద్రకాళి, ఎస్.గౌరీ, యండమూరి ఆదిలక్ష్మి, అను తదితరులు పాల్గొన్నారు.

135 ఎకరాల్లో వరి పంట నష్టం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో మొంథా తుపాను కారణంగా 135 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారిని ఎ.శ్రావణి తేజ తెలిపారు. మండలంలో 391 మంది రైతులు నష్టపోయారని చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించామని తెలిపారు.

బొబ్బిలి మండలంలో 67 ఎకరాల్లో

బొబ్బిలిరూరల్ : మొంథా తుపానుతో కురిసిన వర్షాల వల్ల సుమారు 67 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఎఒ శ్యామసుందర్ తెలిపారు. సోమవారం మండలంలోని పెంట గ్రామంలో సామాజిక తనిఖీ గ్రామసభ ఏర్పాటుచేశారు. మండలంలో 96 మంది రైతులు పంటలు నష్టపోయినట్లు చెప్పారు.

అథ్లెటిక్స్‌కు పరిశీలకులుగా లీలాకృష్ణ

విజయనగరం టౌన్ : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండ్ 14 అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర పరిశీలకులుగా జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి. లీలాకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు డిఇఒ యు.మాణిక్యంనాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు విజయలక్ష్మి, గోపాల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

ఎండిఎం కార్మికుల ధర్నా

బొబ్బిలిరూరల్ : మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయి బిల్లులు విడుదల చేయాలన్నారు. అనంతరం ఎంఇఒ వాసుకు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయ భాస్కర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన ప్రజా గాయకుడు ఆతవ ఉదయభాస్కర్ కుటుంబాన్ని సోమవారం రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పరామర్శించారు. ఇటీవల ఉదయభాస్కర్ సతీమణి ఆతవ లక్ష్మి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఆ కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఆతవ నాగరాజు, గణేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వెటర్లు పంపిణీ

డెంకాడ : స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు హెచ్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వెటర్లను సోమవారం పంపిణీ చేశారు. వీటిని ఎస్‌విఎన్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు రోజా రమణి అందజేయగా, ఎంఇఒ రమణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎంఆర్‌టిలు రామకృష్ణ, భాస్కర్, శ్రీను, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జయచంద్ర నాయుడు, ఐఇఆర్‌పిలు బి.రవీంద్రరావు, కె.అప్పలరాజు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణతో నష్టం

మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టమని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం మండలంలోని సీతారాంపురం, వినాయకపల్లి, , తెలారీ, ఆలుగుబిల్లి, చామలపల్లి గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరించే ప్రయత్నాలను ప్రజలంతా బలంగా వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వాకాడ రాంబాబు, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, మాజీ పుణ్యగిరి ట్రస్ట్ చైర్మన్ పోలమరశెట్టి రామకృష్ణ, యలమంచిలి అప్పలసత్యం, సీతారాంపురం సర్పంచ్ మిడతాన సన్యాసినాయుడు, వీరన్నారాయణం సోంబాబు, మెరపల పురుషోత్తం నాయుడు, చామలపల్లి సూర్యారావు, తలారి అనంత్, ఆలుగుబిల్లి కాశీ పాల్గొన్నారు.

మెరకముడిదాం : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మండలంలో యాడిక, సిరిదేవిపురం, గాదెలమర్రివలస గ్రామాల్లో వైసిపి మండల అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు, సీనియర్ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో బూర్లె నరేష్ కుమార్, గాదెల మర్రివలస సర్పంచ్ అట్టాడ దేవదాస్, యాడిక సర్పంచ్ ప్రతినిధి బొత్స మోహన్ రావు, సిరిదేవపురం సర్పంచ్ దేవర అప్పలనాయుడు పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలోని మోపాడ గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మినాయుడు ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు బడ్డుకొండ మణిదీప్ నాయుడు, వైసిపి పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బడ్డుకొండ రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వంగర

విశాఖ పట్నంలో డిసెంబరు 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం విఆర్‌ఎల సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ మహాసభ జయప్రదానికి కార్మికులు పెద్ద ఎత్తున కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వై.అప్పలస్వామి, పి.విశ్వనాథం, దుర్గారావు, దాలప్పుడు, భాస్కరరావు, శ్రీనివాసు, రమణమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.


వంగర.. మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

బొబ్బిలిరూరల్ : విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా నాయకులు పి.శంకరరావు, మండల నాయకులు ఎస్.గోపాల్ ఆధ్వర్యాన మండలంలోని కోమటిపల్లి, కలవరాయి, చింతాడ, పక్కి, పిరిడి గ్రామాల్లో సోమవారం ప్రచారం చేశారు. కార్మికుల పక్షాన నిలిచే సిఐటియు జాతీయ మహాసభ తొలిసారిగా విశాఖలో జరుగుతుందని వారు తెలిపారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న తమ్మినేని

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రకతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. పట్టణంలో తహశీసిల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టాల్‌ను తమ్మినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి కృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న సంతగౌరమ్మపేట, వినాయకపల్లి గ్రామాలకు చెందిన రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతులలో రైతులు పండించిన ఉత్పత్తులతో ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేసి, విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-రామభద్రపురం

ఉపాధి హామీ కూలీలంతా ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని ఎపిఒ త్రినాథరావు సూచించారు. మండల ఉపాధి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇకెవైసి పూర్తిచేస్తే వేతనదారుల పేమెంట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయన్నారు. ఈ ఏడాది మండలంలో 85 ఎకరాల్లో ఉద్యానవనాలు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మామిడి, జీడి మొక్కలతోపాటు చెరువు గట్లపై పనస, కొబ్బరి మొక్కల పెంపకం చేపడుతున్నామన్నారు. ఈ సీజన్లో కూడా ఎస్‌సి, ఎస్‌టి, ఒంటరి మహిళలకు పనులు కల్పించడానికి కంపోస్టు ఫిట్స్, ఫారంపాండ్స్ చేపడుతున్నామని తెలిపారు. ప్రతిరోజూ 3 వేల మంది కూలీలకు ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటనట్లు వివరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జరజాపుపేట విద్యార్థులు


ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జరజాపుపేట హైస్కూల్ విద్యార్థులు బాలబాలికల విభాగాల్లో ఎం.మోహన్‌కృష్ణ, ఎన్.గీత ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా సిహెచ్.హర్షిణి కూడా ఎంపికైంది. వీరిని హెచ్‌ఎం ఎస్.కామేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా బంగార్రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-భోగాపురం

మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు జన్మదిన వేడుకలు సోమవారం పోలిపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను బంగార్రాజు కట్ చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు నాగమాధవి, అదితి, బేబినాయన, కళా వెంకటరావు, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, గంటా రవితేజ, కోరాడ రాజబాబు.. బంగార్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. కాష్ట్వీ ఆస్పత్రి ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


బంగార్రాజుకు స్వీట్ తినిపిస్తున్న మంత్రి

డెంకాడ : మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు జన్మదినం సందర్భంగా బొడ్డవలసలో టిడిపి యువ నాయకులు చందక తేజ ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ మోపాడ లక్ష్మి, టిడిపి నాయకులు పి.నాయుడు, చందక కృష్ణ, కోన సత్యనారాయణ, మోపాడ శ్రీనివాసు, అట్టాడ నారాయణరావు పాల్గొన్నారు.

శ్మశానాన్ని కబ్జాదారుల నుంచి కాపాడండి

విజయనగరం టౌన్ : విజయనగరం మున్సిపాలిటీ కొత్తధర్మపురి గ్రామంలో శ్మశానాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కొత్తధర్మపురి గ్రామస్తుల అవసరార్థం సర్వే నెంబరు 38-2లో సుమారు 30 సెంట్లు మెట్టు భూమిని గ్రామ శ్మశానవాటిక కింద సుమారు 200 ఏళ్ల నుంచి వాడుకలో ఉందన్నారు. దాని చుట్టుపక్క ఉన్న భూములలో కొంత భాగాన్ని వల్లూరు జయప్రకాశ్‌బాబు తండ్రి వసంతరావు కొనుక్కొని వసంత విహార్ లే-అవుటు 2013లో వేశారని తెలిపారు. శ్మశాన వాటికి అక్కడ ఉండటం వల్ల ఆయన లే-అవుట్ ప్లాట్లు అమ్మకం కావడం లేదని ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు అనేక రకాలుగా ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ధర్నాలో కార్పొరేటర్ గణపతి, మాజీ కౌన్సిలర్ గేదెల ఆదిబాబు, రెడ్డి నారాయణరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను అరికట్టాలని ధర్నా

విజయనగరం టౌన్ : జిల్లాలో గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌లను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, జిల్లా సహాయ కార్యదర్శి వెలగాడ రాజేష్ మాట్లాడారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ముద్దాడ ప్రశాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పుర సేవలు మరింత విస్తృతం

విజయనగరం టౌన్ : ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి పుర సేవలను మరింత విస్తత పరచనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వీటిలో వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఇఇ ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

విజయనగరం టౌన్ : 50వ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వర్షం వస్తే కాలనీ ముంపునకు గురవుతోందన్నారు. కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ధర్నాలో ఎం.అప్పలరాజు, రాజు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ కప్ సాధించడం గర్వకారణం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

భారత్ – సౌత్ ఆఫ్రికా మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ మహిళా టీం సాధించిన విజయం యావత్ దేశానికే గర్వకారణమని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం నగరంలో బొడ్డు కృష్ణ కాలేజీలో విద్యార్థినులతో కలిసి కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్లో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులను సోమవారం సమగ్ర శిక్ష ఎపిసి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ బాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని 285 స్కూళ్లలో 30 మంది శిక్షకులతో 6వ తరగతునుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్యను నేర్పించనున్నట్లు ఆయన తెలిపారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ప్రెసిడెంట్ లక్ష్మీ సామ్రాజ్యం మాట్లాడుతూ విద్యార్థినులంతా శిక్షణపొందాలని అన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు షురూ

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని పాచలవలస గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువలో పేరుకుపోయిన పూడికను, రోడ్లపై చెత్తను తొలగించారు. అన్ని వీధుల్లోనూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు వైసిపి జిల్లా నాయకులు సుమళ గోవింద్ తెలిపారు.

మెరకముడిదాం : మండలంలో యాడిక గ్రామంలో సర్పంచ్ బొత్స పార్వతి ఆధ్వర్యంలో సోమవారం బోరు బావుల్లో క్లోరినేషన్ చేశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బొత్స మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీను, కార్యదర్శి ఎస్.కె.నూర్ అహ్మద్, పారిశుధ్య కార్మికుడు పైడితల్లి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తండ్రిని హతమార్చిన కుమారుడు అరెస్టు

ప్రజాశక్తి-బాడంగి

బాడంగి మండలం గొల్లాదిలో తండ్రి తలనరికి హతమార్చిన నిందితుడైన కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కామన్నవలస గ్రామంలో నిందితుడు మామిడి రాముని పట్టుకున్నామని చెప్పారు. ఈనెల 1వ తేదీన సాయంత్రం గొల్లాది గ్రామంలో మామిడి సత్యంను కొడుకు మామిడి గోవింద హత్య చేసిన విషయం అందరికీ తెలిసిందే. నిందితుడు మద్యానికి బానిసై ప్రతి రోజూ తల్లి, భార్యని హింసపెట్టేవాడని, ఆ రోజు కూడా భార్యని డబ్బులు కావాలని కత్తితో బెదిరించాడని తెలిపారు. మూడేళ్ల నుండి పక్షవాతంతో బాధ పడుతున్న సత్యం తన కోడల్ని బయటకు వెళ్లిపోవాలని సైగ చేశాడు. అది భరించలేని గోవింద మాంసం కొట్టుకొనే కత్తితో మెడ నరికి , ఆ తలను గమేనులో పడేశాడని తెలిపారు. ఇది చాలా క్రూరమైన హత్య అని అన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బొబ్బిలి రూరల్ సిఐ కె. నారాయణ రావు, స్థానిక ఎస్ఐ ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జామి పోలీసు స్టేషనులో 2024 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు మాదవరాయమెట్ట గ్రామానికి చెందిన వంతల శివ (23) కు విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 3సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.4లు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. అంతేకాకుండా బాధితురాలికి పరిహారంగా రూ.50వేలు మంజూరు చేస్తూ తీర్పు వెల్లడించారని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. జామి మండలం మాదవరాయమెట్టలో నివాసం ఉంటున్న నిందితుడు వంతల శివ అదే గ్రామంలో ఉంటున్న 12ఏళ్ల బాలికపై 2024 జూన్ 7వ తేదీ రాత్రి పూట ఇంటి ముందు ఆరు బయట మంచంపై నిద్రిస్తున్న సమయంలో ఎత్తుకొని దగ్గరలో ఉన్న ఒక తోటలోకి తీసుకొని వెళ్ళి, బలవంతం చేయబోగా, బాలిక కేకలు వేయగా దగ్గరలో ఉన్న జనం వెంటనే తోటలోకి వచ్చేసరికి నిందితుడు అక్కడ నుండి పరారయ్యాడన్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి జామి పోలీసు స్టేషను ఎస్ఐ జి.వీరబాబు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసారన్నారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌పి పేర్కొన్నారు.

చోరీ నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గొర్లిపేట ఆలయంలో చోరీ కేసులో నిందితులను పట్టుకున్నట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల తేదీ 26న రాత్రి గొర్లిపేటలో సత్యనారాయణ స్వామి ఆలయంలోకి దుండగులు ప్రవేశించి హుండి పగలగొట్టి, రూ.10 వేల వరకు అపహరించుకుపోయారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, దర్యాప్తు ప్రారంభించారు. మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. గరివిడి మండలం అర్తమూరుకు చెందిన సింక దుర్గా ప్రసాద్, మామిడి పవన్ వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. సోమవారం అరెస్టు చేసి, వారి నుండి రూ.9 వేలు రికవరీ చేసి, జైలుకు తరలించారు. ఈ కేసు ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సిబ్బంది సురేష్, దామోదరావును ఎస్ఐ అభినందించారు

విద్యుత్ తీగ తాకి ఆవు మృతి

ప్రజాశక్తి-బాడంగి

రహదారిపై తెగిపడిన 11కెవి విద్యుత్తు వైరు తగిలి షాక్‌కు గురై ఆవు మృతి చెందింది. మండలంలోని పూడివలసలో పూడి చిన్నకు చెందిన ఆవు సాయంత్రం గ్రామం శివారున రహదారిపై తెగిపడి ఉన్న విద్యుత్తు వైర్‌ను తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆ సమయంలో మనుషులెవరూ ఆ రహదారి గుండా వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కంచారు.

**జనరల్ పబ్లికేషన్
మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి కోర్టులో
IP. 9/2025**

బిట్వీన్ :
మానేపల్లి రామాచారి ....పిటిషనరు
ఎండ్:
బగ్గపు వరలక్ష్మి వగైరాలు ......రెస్పాండెంట్లు

ఆర్1. బగ్గపు వరలక్ష్మి భర్త రమేష్, వయస్సు 48 సం॥లు, ఇందిరమ్మ కోలని, నియర్ సచివాలయం, బొబ్బిలి, విజయనగరం జిల్లా.
ఆర్2. శంబం చిన్నమ్ములు భర్త నాట్ నోన్, వయస్సు 46 సం॥లు, రెస్టుడూ.
ఆర్3. తప్పిట్ల హైమావతి భర్త శ్రీనివాసరావు, వయస్సు 45 సం॥లు, రెస్టుడూ.
ఆర్4. గంటా మహాలక్ష్మి భర్త లేటు సింహాచలం, వయస్సు 60 సం॥లు, రెస్టుడూ.
ఆర్5. యాళ్ల శ్రీనివాసరావు తండ్రి నర్సయ్య, వయస్సు 42 సం॥లు, స్వామివారి వీధి, నియర్ పార్కు, బొబ్బిలి
ఆర్6. లచ్చిపోతుల రామక్రిష్ణ తండ్రి అప్పలనర్సయ్య, వయస్సు 35 సం॥లు, పూల్బాగ్, బొబ్బిలి.
ఆర్7. శివ్వాం అంజిబాబు తండ్రి నాట్ నోన్, వయస్సు 35 సం॥లు ఇందిరమ్మ కోలని, నియర్ సచివాలయం, బొబ్బిలి, విజయనగరం జిల్లా.
ఆర్8. మరడాన ప్రసాదరావు తండ్రి నాట్ నోన్, వయస్సు 60 సం॥లు, గొల్లవీధి, మెయిన్‌రోడ్, నియర్ సచివాలయం, బొబ్బిలి.
ఆర్9. కెల్ల శ్రీనివాసరావు తండ్రి నాట్ నోన్, వయస్సు 39 సం॥లు, నియర్ లారి ఆఫీసు, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.

పైన పేర్కొనబడిన పిటిషనర్, పై కోర్టు వారి దివాల కోరు వాజ్యం నెం. 9/2025 పైన పేర్కొనబడిన రెస్పాండెంట్లు పైన దాఖలా చేయగా వాయిదా వేసి ఉన్నారు. ఎవరికైనను ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల **తేది. 13-11-2025 ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై తమ యొక్క అక్షేషణలు తెలియ చేసుకోవలసినదిగా ఇందు మూలంగా యావన్మంది. ప్రజానీకానికి తెలియచేయడమైనది.

పై కోర్టు వారి ఆదేశాను సారము ఈ ప్రకటన జారి చేయడమైనది.

సి. హెచ్. వి. శ్రీనివాసరావు
పిటిషనరు తరుపు న్యాయవాది
విజయనగరం